నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జులై 22, 2024 | www.navatelangana.com

మహిళ కడుపులోంచి ఐదు కిలోల కణతిని తొలగించిన డాక్టర్లు


వైద్యులు తొలగించిన కణతి

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రానికి చెందిన ఓ మహిళకు తరుచుగా కడుపులో నొప్పిరావడంతో మండల కేంద్రానికి చెందిన శ్రీ సాయి హాస్పిటల్‌లో చూయించుకుంది. మహిళను పరీక్షించిన డాక్టర్లు ఆమె కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించారు. కాగా ఆదివారం డాక్టర్లు ఆ మహిళకు ఆపరేషన్ చేసి మహిళా కడుపులో నుంచి 5కిలోల కణతిని తొలగించినట్లు డాక్టర్ జయప్రకాష్ తెలిపారు.

మెరుగైన సమాజం కోసం అడుగులేయాలి

- దాశరథి జీవితం.. కవులు, కళాకారులు, ప్రజలకు స్ఫూర్తి
- ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజాకవి దాశరథి కష్ణమాచార్య స్ఫూర్తితో మెరుగైన సమాజం కోసం అడుగులు వేయాలని ప్రజావాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న కవులు, కళాకారులకు పిలుపునిచ్చారు. ఆదివారం దాశరథి కష్ణమాచార్య 99వ జయంతి సభను నిజామాబాద్ నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో సిర్పలింగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు గోరేటి వెంకన్న హాజరై మాట్లాడారు.


మాట్లాడుతున్న గోరేటి వెంకన్న

వివరాలు మెయిన్‌లో..

నదులకు కొత్త నీరు

శనివారమంతా వర్షం..

- ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టులకు స్వల్ప వరద
- చెరువులు, కుంటలకు జలకళ
- వర్షానికి కూలిన ఇండ్లు

వర్షాలతో నదులకు కొత్తనీరు వచ్చిచేరుతోంది. ప్రాజెక్టులు జళకళను సంతరించుకుంటున్నాయి. వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు రావడంతో సాలూరా సమీపంలోని మంజీరా నది ప్రవహిస్తోంది. రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమం వద్ద జళకళ ఉట్టిపడుతోంది. శ్రీరాంసాగర్‌తో పాటు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్ప వరద వచ్చి చేరుతోంది. ఇక పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షానికి అక్కడక్కడ ఇండ్లు కూలిపోయాయి. రోడ్లు జలమయ్యాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజాంసాగర్‌లోకి స్వల్ప వరద


నిజాంసాగర్ ప్రాజెక్టు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి 385 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఏఈఈ శివ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.130 టీఎంసీల నీరు ఉంది అని ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీలోకి వరద ప్రవాహం


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

నవతెలంగాణ-మెండోరా

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి ఎగువ, పరిసర ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు అధికారి కొత్త రవి తెలిపారు. బుధవారం నుండి కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి క్రమంగా వరద ప్రవాహం కొనసాగుతూ ఆదివారం సాయంత్రం 18,518 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని తెలిపారు. జూన్ నుండి ప్రాజెక్ట్‌లోకి 13 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా ప్రాజెక్టు నుండి తాగునీరు కోసం వదులుతుండడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు 90.313 టీఎంసీలు కాగా ప్రాజెక్టులోకి క్రమంగా వరద నీరు చేరుతుండటంతో శనివారం 1067.50 అడుగులు 19.380 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

కందకుర్తి గోదావరిలో జలకళ


జలకళను సంతరించుకున్న త్రివేణి సంగమం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం జలకలతో ఉట్టిపడుతోంది. గత 15 రోజుల కిందట ఎడారిగా ఉన్న గోదారి ప్రస్తుతం కొత్త నీటితో కళకళలాడుతోంది. గోదావరి, మంజీరా, హరిద్ర మూడు నదుల నుంచి నీరు రావడంతో గోదావరి జలకళను సంతరించుకుంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ భాగం నుంచి నీరు వస్తుండడంతో గోదావరి కొత్తనీటితో కళకళలాడుతోంది. కందకుర్తి గోదావరిలోకి కొత్త నీరు రావడంతో స్థానిక రైతాంగంలో ఆనందం వ్యక్తమవుతోంది.

మంజీరాలో పెరిగిన వరద నీరు


మంజీరా నదిలో ప్రవహిస్తున్న వరద నీరు

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండల సమీపంలోని మంజీరా నదిలో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో మంజీర నీటితో జలకళను సంతరించుకుంది. గత జూన్ నెలలో 1.2 మీటర్ల నీటిమట్టం నమోదుకాగ, ప్రస్తుతం 3.050 మీటర్ల నీటిమట్టం పెరిగిందని సెంట్రల్ వాటర్ కమిషన్ జూనియర్ ఇంజనీర్ జవహర్‌లాల్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మంజీర నదిలో వస్తున్న వరద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నామని ఆయన తెలిపారు. బోధన్ మండలంలో 84.2 మిల్లీమీటర్లు, సాలుర మండలంలో 62.8 మి.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారి అశోక్ తెలిపారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల పురాతన ఇండ్ల మట్టిగోడలు కూలిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

వర్షానికి నిండిన చెరువులు, కుంటలు


వర్షానికి నిండిన చెరువు

నవతెలంగాణ-మెండోరా

మండలంలో శనివారం కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. చెరువులు, వ్యవసాయ బావులు, కుంటలు కొత్తనీటితో జలకళ సంతరించుకుంది. నిండిన చెరువులను చూసి రైతుల కళ్లలో ఆశలు చిగురించాయి. చెరువుల కింద వానాకాలం సాగుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో పంటల సాగుపై ఆశలు వదులుకున్న రైతులు శనివారం కురిసిన వానలకు చెరువులు, కుంటలు, బావులు కొంతమట్టుకు నిండటంతో చెరువుల ఆయకట్టుకు ఉన్న రైతులు ఊపిరి పీల్చుకొని వరి సాగుకు సిద్ధమవుతున్నారు. మరికొందరు ప్రాజెక్టులో కొంత మట్టుకు ఎగువ ప్రాంతాల నుండి వరద వచ్చి చేరినా ప్రాజెక్టులో అనుకున్నంతగా నీరు లేకపోవడంతో సాగునీరు ఇస్తారో లేదో అని ఎదురుచూస్తూ బిక్కు బిక్కుమంటూ నిరాశకు గురవుతున్నారు.

నీటమునిగిన పంట పొలాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ శివారులోని ఆలూర్ బైపాస్ రోడ్డులో ఇటీవల కురిసిన వర్షాలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వరద నీరు రావడంతో పంట పొలాలు నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూర్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తమ పంట పొలాలు నీట మునిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు చెప్పారు. వరద నీటిని తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు.


వరి పంటలోకి వచ్చిచేరిన వర్షపు నీరు

పొంగిపొర్లుతున్న బెల్లాల్ అలుగు

నవతెలంగాణ-బోధన్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి బోధన్ మండలంలోని బెల్లాల్, పాండుఫారం చెరువులు నిండుకుండలా తలపిస్తున్నాయి. చెరువులో నీరు నిండడంతో మత్తడుల దగ్గర అలుగులు ప్రవహిస్తున్నాయి. చెరువులోని నీరు అలుగులు ప్రవహించడంతో పలువురు అలుగు వద్దకు చేరుకొని చెరువులోని చేపలను పడుతున్నారు. చాలా రోజుల తర్వాత చెరువులలో నీరు నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


బెల్లాల్ చెరువు వద్ద చేపలు పడుతున్న వ్యక్తులు

వర్షం.. పంట సాగుకు అనుకూలం..

నవతెలంగాణ-మద్నూర్

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు పంట సాగుకు ఎంతో అనుకూలించాయని మద్నూర్ మండలం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సాగుచేసిన పెసర, మినుము, సోయా, కంది, పత్తి తదితర పంటలు విత్తుకున్న తర్వాత 15, 20, రోజులపాటు వర్షాలు పడక రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఈనెల 17 నుంచి 21 వరకు అడపాదడపా ముసురు వర్షం కురియడంతో పంటలకు ఎంతో అనుకూలించాయని రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 19న 43.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది, ఈనెల 21న 33.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

కూలిన ఇల్లు

నవతెలంగాణ-లింగంపేట్

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని బోనాల తాండకు చెందిన జగ్యా నాయక్ చెందిన నివాసపు ఇల్లు పూర్తిగా కూలిపోయింది. దీంతో ఇంట్లో బియ్యం, వంట సామగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. అధికారులు సకాలంలో స్పందించి కూలిపోయిన నివాస గృహాన్ని పరిశీలించాలని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.


వర్షానికి కూలిపోయిన ఇల్లు

గుంతలమయంగా సాటాపూర్ చౌరస్తా

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ ప్రధాన చౌరస్తా గుంతల మయంగా మారడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. నలుమూలల నుంచి చౌరస్తాకు వందలాదిమంది వస్తూపోతూ ఉంటారు. సాటపూర్ చౌరస్తా గుంతలు ఏర్పడి నీరు నిండుకోవడంతో ప్రమాదాలు తప్పడం లేదని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిరుజల్లులకే గుంతలలో నీరు నిండుకోవడంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి చౌరస్తాలో ఉన్న గుంతలను పూడ్చివేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


గుంతల్లో చేరిన వర్షపు నీరు

చిత్తడిగా ఎస్సీ కాలనీ రహదారి

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుపై లీకేజీ నీరు, వర్షపు నీరు నిలిచిపోవడంతో చిత్తడిగా మారింది. కాలనీవాసులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కాలనీలో పిచ్చిగడ్డి పెరిగిపోయి దోమలు పెరుగుతున్నాయని దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని కాలనీ వాసులు పేర్కొన్నారు. కనీసం దోమల నివారణ మందు పిచికారీ చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గ్రామ ప్రత్యేక అధికారి తహసీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా రెండు, మూడు రోజుల్లో పారిశుధ్య, రహదారిపై నిలిచిన నీటిని తొలగించేలా చర్యలు చేపడతామని తెలిపారు.


బురదమయంగా మారిన ఎస్సీకాలనీ రోడ్డు

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశావర్కర్ల సమస్యలపై సోమవారం తలపెట్టిన కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. ఆదివారం నగరంలోని సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18000 ఇవ్వాలని, ఇతర సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా ఉంటుందన్నారు. ఆశా వర్కర్లు 15 రోజులుగా సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను, ఫిబ్రవరి 9న ఆరోగ్యశాఖ కమిషనర్‌కి ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలిపారు. గతంలో ఇచ్చినట్టుగానే ఆశావర్కర్ల వేతనాలు ప్రతినెల 5వ తేదీలోపు వారి అకౌంట్లో జమ చేయాలని కోరారు. ఆశావర్కర్లకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని, ఇస్తున్న పారితోషికంలో సగం పెన్షన్ రూపంలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికై నేడు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య, పద్మా సునీత, స్వప్న, రేవతి, గౌరీ, గీత, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ టు రాజంపేట్

- 66 ఫీట్ల రోడ్డుకు టెండర్లు పూర్తి.. అగ్రిమెంట్ పెండింగ్
- త్వరలో ప్రారంభం కానున్న రోడ్డు విస్తరణ పనులు
- ప్రస్తుతం 33 ఫీట్లు.. అనుమతులు 66 ఫీట్ల తర్వాతే
- ఇండ్లు పోతున్న బాధితుల పరిస్థితి ఏంటి..?



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలో వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభించనున్నారు. భిక్కనూర్ పట్టణం నుంచి రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, మోటాట్‌పల్లి, ఆరేపల్లి, తలమడ్ల గ్రామం మీదుగా రాజంపేట్ మండలం వరకు 66 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నారు. మరో రెండు నెలల్లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు. టెండర్ల పనులు పూర్తికాగా.. కేవలం అగ్రిమెంట్ మాత్రమే మిగిలి ఉంది. అది పూర్తికాగానే రోడ్డు కొలతలు వేసి పనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టనున్నారు.

ప్రస్తుతం 33 ఫీట్లు.. భవిష్యత్తులో 66 ఫీట్లు..

భిక్కనూర్ పట్టణం నుంచి రాజంపేట్ వరకు ప్రస్తుతం 18 ఫీట్ల రోడ్డు ఉంది. కాని వాస్తవానికి ఆర్అండ్‌బీ లెక్కల ప్రకారం 66 ఫీట్ల రోడ్డు గతంలో ఉన్న ప్రజలను, వాహనాలను దృష్టిలో ఉంచుకొని 18 ఫీట్ల రోడ్డు ఏర్పాటు చేశారు. కాలానికి అనుగుణంగా పెరుగుతున్న వాహనాలు, ప్రజలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 33 ఫీట్ల రోడ్డు పనులు ప్రారంభించి భవిష్యత్తులో మరోసారి 33 ఫీట్ల రోడ్డు పనులు ప్రారంభించనున్నారు. 33 ఫీట్ల రోడ్డు తర్వాత 5 ఫీట్లు ప్రజలు నడవడానికి మొరం వేస్తారు. మొత్తం ప్రస్తుతం ఉన్న రోడ్డు మధ్యలో నుంచి రెండు వైపులా 21.5 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు జరగనున్నాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డును వదిలేసి రెండు వైపులా 12.5 ఫీట్ల రోడ్డు విస్తరించనున్నారు.

గ్రామపంచాయతీ అనుమతులు 66 ఫీట్ల తర్వాతే...

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తున్న తరుణంలో అనుమతులు ఎక్కడి నుంచి తీసుకోవాలని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు ఆరుగ్రామాల మీదుగా రాజంపేట్ పట్టణానికి చేపట్టనున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించనున్న నిర్మాణాలు ఎన్ని ఫీట్ల అవతల నిర్మించుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

ఆర్అండ్‌బీ అధికారుల ప్రకారం 66 ఫీట్ల రోడ్డు ఉందని భవిష్యత్తులో ఎప్పటికైనా 66 ఫీట్ల లోపల నిర్మాణాలు చేపడితే రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న సమయంలో నిర్మించిన నిర్మాణాలు కోల్పోవాల్సి వస్తుందని సూచిస్తున్నారు. ప్రస్తుతం 33 ఫీట్ల వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభిస్తున్నందున ప్రస్తుతం ఉన్న నిర్మాణాలు చేపడుతున్న, నిర్మించి ఉన్న ఇండ్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

టెండర్లు పూర్తి.. అగ్రిమెంట్ పెండింగ్..

భిక్కనూర్ పట్టణం నుంచి రాజంపేట్ మండలం వరకు రోడ్డు విస్తరణ పనులకు టెండర్లు పూర్తయ్యాయి. కేవలం అగ్రిమెంట్ మాత్రమే పెండింగ్‌లో ఉంది. అగ్రిమెంట్ పూర్తికాగానే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నారు. ప్రస్తుతం తలమడ్ల గ్రామం వరకు 25 కోట్ల రూపాయలతో 33 ఫీట్ల రోడ్డు పనులు చేపట్టనున్నారు. తలమడ్ల వరకు పనులు పూర్తయిన తర్వాత తలమడ్ల నుంచి రాజంపేట్ వరకు మరోసారి టెండర్లు వేయనున్నారు. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆర్అండ్‌బీ అగ్రిమెంట్లు ఉన్న విధంగా పనులు చేపట్టవలసి ఉంటుంది. మరో రెండు నెలల తర్వాత పనులు ప్రారంభించే సమయంలో మార్కింగ్ వేసుకొని పనులు చేపట్టనున్నారు.

ఇండ్లు పోతున్న బాధితుల పరిస్థితి ఏంటి..?

భిక్కనూర్ నుంచి తలమడ్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టే సమయంలో ఆరుగ్రామాల మీదుగా వెళ్తున్న రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. గ్రామ ప్రజల అభిప్రాయాల మేరకు గ్రామంలో పనులు విస్తరించకుండా వదిలేస్తారా..?, భవిష్యత్తు కార్యచరణ దృష్టిలో ఉంచుకొని రోడ్డు విస్తరణ పనులు పూర్తిస్థాయిలో చేపడతారా అన్న సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. గ్రామపంచాయతీ అధికారులు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ఇంటి నిర్మాణం సమయంలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇంటి నిర్మాణాలను ఆర్అండ్‌బి రోడ్డు ఎన్ని ఫీట్లు ఉందో తెలుసుకొని ఆ రోడ్డు అవతల ఇంటిని నిర్మించుకోవాలని అనుమతులు ఇవ్వాలి కానీ గతంలో ఇంటి నిర్మాణాలకు ఇచ్చిన అనుమతుల కారణంగా ప్రస్తుతం ఇండ్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

వాస్తవానికి గ్రామంలోపల ఇంటిని నిర్మించుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డుకు ఇరువైపులా ఇంటిని నిర్మించుకున్న వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జనాభా, వాహనాల పెరుగుదల కారణంగా రోడ్డుపై వెళ్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు విస్తరణ పనులు చేపడు తున్నారు. కారణంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మించుకున్న ఇంటి నిర్మాణాల వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కాలంలో భిక్కనూర్ పట్టణంలో రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మించుకున్న నిర్మాణాలు కొన్ని కూల్చి రోడ్డు విస్తరణ, డ్రైనేజీని నిర్మించి రోడ్డుకు 55 ఫీట్ల అవతల ఇంటిని నిర్మించుకోవాలని గ్రామపంచాయతీ అధికారులు అనుమతులు ఇస్తున్నారు.

ప్రస్తుతం భిక్కనూర్ నుంచి తలమడ్ల వరకు ప్రారంభించనున్న రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ఆరు గ్రామాలలో మరోసారి ఇంటిని కోల్పోవలసి వస్తుందని గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు 66 ఫీట్ల రోడ్డులో ప్రస్తుతం 33 ఫీట్ల రోడ్డు వేసి భవిష్యత్తులో 66 ఫీట్ల రోడ్డు వేస్తారని సమాచారం. రోడ్డు పనులు చేపడుతున్న సమయంలో ప్రజాప్రతినిధులు గ్రామప్రజల ఇండ్లు కూల్చకుండా ప్రత్యామ్నాయ ఆలోచన చేసి రోడ్డు విస్తరణ పనులు చేపడతారా..?, ప్రస్తుత 33 ఫీట్ల రోడ్డు నిర్మించి భవిష్యత్తులో నిర్మించే 33 ఫీట్ల రోడ్డుకు ఆలోచన చేస్తారా..? వేచి చూడాల్సి ఉంది.

ఏది ఏమైనప్పటికీ ఇంటిని నిర్మించుకునే వారు ప్రస్తుతం ఉన్న రోడ్డు గ్రామపంచాయతీ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్డు ఏదో తెలుసుకొని ఆ రోడ్డు ఎన్ని ఫీట్లు వరకు ఉంటుంది. ఎన్ని ఫీట్ల అవతల ఇంటిని నిర్మించుకోవాలి పూర్తి వివరాలు గ్రామపంచాయతీలో తెలుసుకొని నిర్మించుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు తెలియజేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
2
సోమవారం | జులై 22, 2024 | www.navatelangana.com

పెద్ద పోచమ్మకు గంగనీళ్ల బోనాలు


గంగనీళ్ల బోనాలతో గ్రామస్తులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద పోచమ్మ తల్లికి గంగనీళ్ళు బోనాలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ ఏడాది కూడా వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో వీడిసి చైర్మన్ ఇంద్ర గౌడ్ , సాగర్, గొల్ల మొత్తెన్న, మాజీ ఎంపీపీ డికొండ హరిత శ్రీనివాస్, గ్రామ మాజీ సర్పంచ్ ఆత్మకూరు గంగుబాలయ్య, గ్రామ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్ తెలంగాణ జాగృతి అధ్యక్షులు అజయ్, అన్ని కులసంఘాల పెద్దలు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఈరవత్రి అనిల్‌ను సన్మానించిన వీడీసీ


ఈరవత్రి అనిల్‌ను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ ను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం మండలానికి మొదటిసారి రావడంతో శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు గంగాధర్, సభ్యులు సంజీవ్ గౌడ్, ఆరేపల్లి నర్సయ్య, పి.సురేష్ ,గ్రామ సదర్ సల్ల నర్సయ్య తదితరులు ఉన్నారు.

పడకల్ లైబ్రరీకి పుస్తకాల వితరణ

- రూ.5వేల విలువగల పుస్తకాలు అందజేసిన లైబ్రేరియన్


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న లైబ్రేరియన్ నరేష్

నవతెలంగాణ-జక్రాన్ పల్లి

మండలంలోని పడకల్ గ్రామీణ లైబ్రరీకి మండల కేంద్రంలో పనిచేస్తున్న లైబ్రేరియన్ నరేష్ రెడ్డి 5 వేల పుస్తకాలను వితరణ చేసినట్టు పడకల్ గ్రామానికి చెందిన అంకం నరేష్ ఆదివారం తెలిపారు. మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు అంకం నరేష్, శ్రీనివాస్ రెడ్డి ప్రోద్భలంతో లైబ్రేరియన్ నరేష్ రెడ్డి పడకల్ గ్రామీణ గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను వితరణ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ యువత ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అంకం నరేష్ , శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి, సవీన్, బాలా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లిగడ్డ ధర



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పెరిగిన ఉల్లిగడ్డ ధర కన్నీళ్లు పెట్టిస్తోంది. ప్రజలు కొనడానికి వెనుకా ముందు అవుతున్నారు. గతంలో 100 రూపాయలకు నాలుగు కిలోలు ఇచ్చేవారు.. శనివారం మండలకేంద్రంలోని సంతలో 50 రూపాయలకు ఉల్లిగడ్డ అమ్మారు. ప్రతి ఇంట్లో ఉల్లిగడ్డ లేనిది గడవని పరిస్థితి. కావున తప్పని పరిస్థితిలో కిలో 50 రూపాయలకు ఉల్లిగడ్డలు కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులను ఉల్లిగడ్డ ధరపై ఆరా తీయగా తెలంగాణలో ఉల్లిగడ్డ దిగుబడి ఎక్కువ రాకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ఉల్లిగడ్డ ధర పెరిగిందని అంటున్నారు. కనీసం 100కు మూడు కిలోలైన ఇవ్వాలని ప్రజలు బేరమాడిన రెండు కిలోలు మాత్రమే ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గమనించి సబ్సిడీపై ఉల్లిగడ్డలను సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకర గుంత పూడ్చివేత


గుంత పూడ్చిన యువకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్, వెల్కటూర్ గ్రామాల మధ్య గల రోడ్డుపై ఉన్న ప్రమాదకరమైన గుంతను బట్టాపూర్ గ్రామానికి చెందిన యువకులు ఆదివారం పూడ్చివేశారు. గ్రామ శివారులోని రామాలయం వద్ద కల్వర్టు పక్కన రోడ్డుపై ప్రమాదకరమైన గుంత ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని గమనించారు. భారీ వర్షాల నేపథ్యంలో మరెవరికి ఇబ్బంది కలుగకూడదని గుంతను పూడ్చివేశామని యువకులు తెలిపారు. దీనితో గ్రామస్థులు వారిని అభినందించారు. ఇందులో భాగంగా దయానంద్, భూషణవేణి గంగాధర్, నర్సయ్య యాదవ్, అశోక్, కండెల భూమేష్, మనోజ్, రమేష్ గౌడ్, ఇమామ్, నూకల గంగాధర్,కాటిపెల్లి సాగర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

హసకొత్తూర్‌లో వలగొడుగు పండుగ


వలగొడుగు పండుగలో పాల్గొన్న యువకులు, గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తుర్ గ్రామంలో స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతల పండుగలో భాగంగా గంగపుత్రులు వలగొడుగు పండుగను ఘనంగా ఆదివారం నిర్వహించారు. గ్రామం నుంచి గ్రామదేవతల ఆలయాల వరకు వల గొడుగుతో వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, పిల్లా పాప, గొడ్డు గోదా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కోమ్ముల రజినీకాంత్, కార్యదర్శి కుందారం శ్రావణ్, ఉపాధ్యక్షులు చిన్న బాబయ్య, క్యాషియర్ నర్సయ్య, రైటర్ పెద్ది ధన్‌రాజ్, ఖాతాదారు కొమ్రే అంజి, సభ్యులు లింబద్రి, ఆదర్శ్, గణేష్, భారత్, వినయ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత

- ఎస్ఈ రవీందర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ నిజామాబాదు సర్కిల్ పరిధిలో వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని సూపెరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్ తెలిపారు. బట్టు ఆరవేసే జిఐ దండెం వైర్లపై నుండి విద్యుత్ వైర్లు వెళ్లడం వల్ల విద్యుత్ వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం వల్ల దండేలకు విద్యుత్ సరఫరా అయ్యి షాక్ గురయ్యే ప్రమాదం ఉందని, కనుక ప్లాస్టిక్ దండేలను ఉపయోగించాలని కోరారు. ఇంటి ముందు రేకులకు కూడా విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. కనుక విద్యుత్ సరఫరా వైర్లను ఎట్టి పరిస్థితుల్లో దండేలాలకు, రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. తరచుగా విద్యుత్ ప్రమాదాలు జరగడం ఆందోళన కలుగుతుందని, ఇవి ప్రధానంగా భద్రత పట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం వలన విద్యుత్ వినియోగదారుల గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం వల్ల, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం వల్ల రైతులు స్విచ్ బోర్డు, మోటార్ స్టార్టర్ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని అన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు సూచనలు..

ముఖ్యంగా రైతు సోదరులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం, వ్యవసాయ పంపు సెట్లను వినియోగించినపుడు కరెంటు మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కావున కరెంటు మోటార్లను కాని, పైపులను కాని, ఫుట్ వాల్వులను కాని ఏమరపాటుతో తాకకూడదని తెలిపారు. వ్యవసాయ పంపు సెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలని, విద్యుత్ ప్రమాదాలు ఎర్త్ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయని అన్నారు. ఎర్త్ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జిఐ పైపులు, ఫుట్ వాల్వు తాకడం అత్యంత ప్రమాదకరమని, ఎర్తింగ్ అనేది చాలా సులభంగా చేసుకోవచ్చని తెలిపారు.



రైతులు, వినియోగదారులు స్వయంగా తమ సొంత కరెంట్ పనులను చేసుకొని నిండు ప్రాణాలు కోల్పుతున్నారని, చాల బాధాకరమని, అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తో పనులు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు.లయజమానులు పశువులను మేతకు తీసుకువెళ్ళినప్పుడు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్థంబాలు దగ్గరికి వెళ్లకుండా కాపరి వాళ్ళు జాగ్రత్త వహించాలని కోరారు. వర్షాకాలంలో తడిగా స్థంబాలు ఉండటం చేత ప్రమాదాలు జరిగే ఆవకాశం ఉంది కనుక జాగ్రత్త వహించాలని అన్నారు. ఇంటి వైరింగ్‌కు సరైన ఎర్తింగ్ చేయండని, నాణ్యమైన ప్లగ్గులు, సెల్ ఫోన్ చార్జర్లను ఉపయోగించి ట్రాన్స్ ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఎబి స్విచ్లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరమని, వ్యవసాయ పంపుసెట్లకు ఫేజ్ కన్వర్టర్ వాడుట నిషేధం, శిక్షార్హులు. మోటారు, పంపుసెట్లకు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే స్వంతంగా సరిచేద్దామని ప్రయత్నిస్తే ప్రాణనష్టం, హాని జరగవచ్చని, మోటారు రిపేరు తెలిసిన వారిచేతనే చేయించాలని అన్నారు. వ్యవసాయ మోటార్లకు, గృహాలలో అతుకులు (జాయింట్) లేని సర్వీసు వైరును మాత్రమే ఉప యోగించాలని, కరెంటు లైన్ల కింద పందిరిలు (టెంటు) వేసి ప్రమాదాలకు గురవుతున్నారని, పందిళ్ల వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

చేపల వేటకు విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరమని, చట్ట విరుద్ధం అని, బోరు వేస్తున్నప్పుడు, బోరు పైపులను తీసినప్పుడు పైన విద్యుత్ వైర్లు తాకి కొందరు చనిపోతున్నారని, బోర్లు వేస్తున్నప్పుడు పైన విద్యుత్తు వైర్లు ఉన్నాయో లేదో ఒకసారి చూసుకొని జాగ్రత్తగా బోర్లు వేయాలని కోరారు. జెండా ఎగుర వేయునప్పుడు ఆ జెండా పైపులు రోడ్డుపై వైర్లకు తాకకుండా జాగ్రత్త వహించాలని, వరి కోతల సమయంలో హార్వెస్టర్ల పైకి వెళ్ళినప్పుడు విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయని, జాగ్రత్త వహించాలని, వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు వైర్లు నేలపై నుండి తీసుకువెళ్ళుతున్నారు.

బాటసారులు ఆ వైర్లు చూడకుండా వెళ్ళుతు విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారు. నేలపై నుంచి విద్యుత్ వైర్లు వేయకూడదని, సెల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడం వల్ల షాక్ కు గురై చనిపోతున్నారని అన్నారు. చార్జింగ్ బంద్ చేసి మాట్లాడవలసిందిగా వినియోగదారులను కోరారు. కొన్ని చోట్ల జంతువుల నుండి పంట రక్షణ కొరకు విద్యుత్తు ఫెన్సింగ్ వేస్తున్నారు. ఇది చట్ట రిత్యా నేరం, పంట చుట్టు విద్యుత్తు ఫెన్సింగ్ ఉన్నచోట జాగ్రత్త చాలా అవసరం అటు వైపు వెళ్ళకుండ జాగ్రత్త వహించాలని, పొలాలకు విద్యుత్ కంచెలు వేయొద్దని అన్నారు. వర్షాలు కురిసినప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు, సపోర్టు వైరును, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకరాదని, తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదని అన్నారు.

గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలిపాలని, ఎవరికైనా పొరపాటున కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలన్న ఆతృతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోరాదని అన్నారు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులను వాడాలని తెలిపారు. గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బంది లైన్మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్‌లను సంప్రదించాలని సూచించారు. నెలవారీ కరెంట్ బిల్లులో ముద్రించిన ఏఈ ఫోన్ నెంబర్ ముద్రించి ఉంటుంది అని, ఆ నెంబర్‌ను సంప్రదించి సేవలు పొందవచ్చు అని అన్నారు.

పదోన్నతి వచ్చినా.. కుటుంబాలకు దూరమే

- వీఆర్ఏల ఆందోళన

నవతెలంగాణ-ఆర్మూర్

పదోన్నతి ఇచ్చి.. కుటుంబాలకు, వృద్ధ తల్లిదండ్రులకు దూరంగా ఉద్యోగం చేస్తున్నామని వీఆర్ఏలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం 2023 ఆగస్టులో పూర్వ వీఆర్ఏలందరికీ జీవో ఎంఎస్ 81 ద్వారా పదోన్నతి కల్పించి, అర్హతలను బట్టి వివిధ క్యాడర్లలో ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. బదిలీ అయిన పూర్వ వీఆర్ఏలు గున్నం, సంతోష్, సాయినాథ్, పృథ్వి, దొండ రాకేష్, గిరి, సుధాకర్, హరిచరణ్, మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్లుగా, వార్డు ఆఫీసర్లుగా, రికార్డు అసిస్టెంట్‌గా, ఆఫీస్ సబార్డినేటర్లుగా కిందిస్థాయి ఉద్యోగాల్లో భర్తీ చేశారని వాపోయారు. కొందరిని అశాస్త్రీయమైన ర్యాండమైజేషన్ ద్వారా జిల్లా స్థాయి పోస్టులను వివిధ జిల్లాలకు స్థానికతకు విరుద్ధంగా బదిలీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. పదోన్నతి వచ్చిన సంతోషం కంటే కుటుంబానికి దూరంగా మానసిక క్షోభ అనుభవిస్తూ ఉద్యోగం చేయాల్సి వస్తుందని వారు ఆందోళన వెలిబుచ్చారు.

తెలంగాణ ఏర్పడినప్పటినుంచి..

తెలంగాణ ఏర్పడినప్పటినుంచి సమగ్ర కుటుంబ సర్వే, భూ రికార్డుల ప్రక్షాళన, సామాజిక పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మొదలుకొని రైతుబంధు, దళిత బంధువరకు అనేక సర్వేలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేర వేయడంలో వీఆర్ఏలు ప్రధాన భూమిక పోషించారన్నారు. రాత్రింబవళ్లు చాకిరీ చేస్తున్న వారి శ్రమకు తగ్గ ఫలితం దక్కలేదు. కనీస వేతనాలు చట్టబద్ధ హక్కులు గత ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. గత రెండు సంవత్సరాల క్రితం వీఆర్ఏ, జేఏసీ ఆధ్వర్యంలో సమ్మెలు సైతం నిర్వహించినారు.

జిల్లా నుంచి..

జిల్లా నుంచి 201 మంది సూర్యాపేట, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హనుమకొండ, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సంగారెడ్డి, నారాయణపేట్, వికారాబాద్, యాదాద్రి, భువనగిరి, నల్గొండ జిల్లాలకు సుమారుగా 200 నుంచి 500 కిలోమీటర్ల దూరంలో కుటుంబాలకు, వృద్ధ తల్లిదండ్రులకు దూరంగా ఉద్యోగం చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళలు, వికలాంగులు అనే తేడా లేకుండా ఇతర జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. దయచేసి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను బి-17 జీవో ద్వారా ఇతర జిల్లాల్లోకి వెళ్లిన ఉద్యోగులను స్థానికత ద్వారా సొంత జిల్లాలకు రప్పించి ప్రయత్నం చేస్తున్న తరుణంలో స్థానికత ఆధారంగా తిరిగి సొంత జిల్లాలోని పోస్టింగులు ఇవ్వాలని వారు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల 2002-2003 సంవత్సర పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వికన్వెన్షన్ హాలులో ఘనంగా ఆదివారం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు దాదాపు 22 వసంతాల తర్వాత అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

తాటిపత్రాలు అందజేత



తాటిపత్రాలు అందజేస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు

నవతెలంగాణ-భీంగల్

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల దేవన్‌పల్లి (తాళ్లకుంట)లో గుడిసెలలో నివసిస్తున్న పేద కుటుంబాలు వసతులు లేక ఇబ్బంది పడు తుండడంతో గుర్తించిన ఎన్ఎస్‌యూఐ నాయకులు తాటిపత్రాలు అందజేశారు. నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్, బాల్కొండ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ మొండి దినేష్ ఆధ్వర్యంలో వారి సొంత డబ్బులతో పేద కుటుంబాలకు తాటి పత్రాలను అందించారు. పేదలను గుర్తించి ఇలాంటి సహాయం చేసిన యువకులకు గ్రామస్తులు పేదలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ యువకులు కార్తీక్, రేశ్వంత్, రిషి, రహీల్, అరవింద్, హర్షిత్ యువకులు పాల్గొన్నారు.

పెరిగిన టమాట ధర

- కొనాలంటే వెనుకంజ వేస్తున్న ప్రజలు



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

టమాటా కొనాలంటే ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. శనివారం మండల కేంద్రంలో అంగడిలో కిలో 60 రూపాయలకు అమ్మడంతో ప్రజలు కొనుగోలు చేయలేకపోతున్నారు. గతంలో అంగడిలో 30 నుంచి 40 నుంచి కిలో టమాట ధర కొనుగోలు చేశామని, ఇప్పుడు మాత్రం కిలో 60 రూపాయలు పలకడంతో ప్రజలు ఇబ్బందులకు గురై కొనలేకపోతున్నారు. ప్రతి ఇంట్లో టమాట అవసరం ఉండడంతో తప్పని పరిస్థితులలో 60 రూపాయలకు కిలో కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులను టమాట గురించి ఆరా తీయగా తెలంగాణలో టమాట దిగుబడి తగ్గడంతో ఇతర రాష్ట్రాల నుంచి టమాటాను దిగుమతి చేసుకొని అమ్మాలంటే ట్రాన్స్ పోర్ట్ ఖర్చులు చాలా అవుతున్నందున 60 రూపాయలు అమ్మ వలసి వస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆలోచించి టమాట ధర సబ్సిడీ ద్వారా ఇప్పించే ఏర్పాటు చేయాలని ప్రజల కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మెండోర మండలంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పరామర్శించారు. మెండోర మండల కేంద్రానికి చెందిన మాకురి వినోద్ గల్ఫ్ దేశం బహరైన్ లో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృత దేహాన్ని ఇండియాకు తీసుకురావడానికి ప్రభుత్వం తరుపున ప్రయత్నం చేస్తామని తెలిపారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం కల్పించారు. మండల కేంద్రానికే చెందిన వడ్ల రవి క్యాన్సర్ తో మరణించారు. అదేవిధంగా మంగలి రాజు వాళ్ళ అమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఇరువురి కుటుంబాల సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. వెల్కటూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త అనంత్ వాళ్ళ అమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

మల్లికార్జున ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



నవతెలంగాణ-లింగంపేట్

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు ఆదివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మల్లికార్జున్ ఖర్గేను ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నెహ్రూ యూత్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని దేవునిపల్లి గ్రామ నెహ్రూయూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా కాసర్ల భానుచందర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా అరవింద్, ప్రధాన కార్యదర్శిగా గణేష్, రాజ్‌కుమార్, కోశాధికారిగా వరకూటి బాల్‌రెడ్డి, సలహాదారులుగా నాగార్జున, శరత్, డి.శ్రీకాంత్, సతీష్, సందీప్, నరేష్, సుధీర్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

బిజెపి నాయకునికి పరామర్శ

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన బిజెపి మండల అధ్యక్షుడు అంబటి నవీన్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల అంబటి నవీన్ నానమ్మ చనిపోవడంతో ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ బాల్కొండ టౌన్ ప్రెసిడెంట్ సంజీవ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

గణపతి ఆలయంలో పూజలు

నవతెలంగాణ-మోపాల్

గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం బోర్గాం (పి) గ్రామ శివారులోని లక్ష్మీ గణపతి ఆలయంలో ఆది గురువులు జగద్గురువు శ్రీ శంకరాచార్య, శృంగేరి భారతీ తీర్థ మహాస్వామికి, శ్రీశ్రీశ్రీ విధిశేఖర భారతి మహాస్వామి పాదుకలకు అరుణ్ కుమార్ వర్మ లక్ష్మీ గణపతి మహా ఆలయంలో పంచామృత అభిషేకం, నామార్చనల, హారతి చేశారు. పాడి పంటల అభివృద్ధి చెందాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకున్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బహుమతుల ప్రధానం



నవతెలంగాణ-మోపాల్

జిల్లాస్థాయి తైక్వాండో పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు నిజామాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్, ధర్పల్లి మాజీ జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ బహుమతులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో సెక్రటరీ మనోజ్ మాస్టర్, కోశాధికారి వెంకట్ రమణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- పదిమంది పేకాట రాయుళ్లు అరెస్ట్



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాల్కల్ రోడ్‌లోగల లలితా నగర్ పేస్- 2 లో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగ్గ సమాచారం మేరకు నిజామాబాద్ టాస్క్ ఫోర్స్ ఏసిపి విష్ణుమూర్తి, సిఐ పురుషోత్తం బృందం ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పదిమంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, 10 సెల్ ఫోన్లు, 5200 నగదు స్వాధీనం చేసుకొని సంబంధిత పోలీస్ స్టేషన్లో అప్పగించారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి



ప్రధానోపాధ్యాయుడిని సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు

ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ఆఫ్ మాజీ అధ్యక్షులు పెరిక రాజలింగంను లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షులు మనోజ్ కుమార్, కోశాధికారి గంగారెడ్డి, లయన్ పుష్పలత, లయన్ కదం ప్రకాష్‌రావు, లయన్ మెర్సీ(రాధ) తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బట్టల వర్తక సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-కామారెడ్డి



ఎన్నికైన బట్టల వర్తక నూతన కార్యవర్గం

కామారెడ్డి జిల్లా బట్టల వర్తక సంఘం ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా గడిల నర్సింలు, అధ్యక్షులుగా తాటిపాముల సందీప్, ఉపాధ్యక్షులుగా సూరం బాలకిషన్, ఎల్‌వి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గుజ్జ రాజు, జాయింట్ సెక్రటరీగా సామల దామోదర్, గుండా రాజ్‌కుమార్, కోశాధికారిగా మాదాసు వెంకటేశం, మీడియా ఇంచార్జీగా గర్దస్ శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బాలే భరత్ కుమార్, సలహాదారులుగా సింధం పరమేశ్వర్, పడిగే రాములుతో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

వైభవంగా బోనాల పండగ



ఎడపల్లి: ఏఆర్‌పి క్యాంప్‌లో బోనాల పండుగలో గౌడ సంఘం సభ్యులు



కామారెడ్డిలో...



మద్నూర్‌లో..

- ఉత్సాహంగా పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లో ఆ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ బోనాలు తీసి ఊరేగింపు చేపట్టారు.

ఘనంగా మహంకాళి బోనాలు..

దోమకొండ : మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి సిద్దరెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో మహంకాళి బోనాల పండగ సందర్భంగా అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి బోనాలను ఆదివారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు శేఖర్, రమేష్, నాయకులు అనంతరెడ్డి, తీర్మాల్‌గౌడ్, నర్సారెడ్డి, మనోజ్, ఆలయ ఈవో ప్రభు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, పెద్దమ్మ తల్లి గౌడ సంఘం మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పు వాయిద్యాలతో బోనాలను ఊరేగించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలకు తరలివెళ్లారు.

శెట్టిపల్లి సంగారెడ్డిలో ముత్యాల పోచమ్మకు బోనాలు..

లింగంపేట్ : మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామంలో ఆదివారం ముత్యాల పోచమ్మ బోనాలు తీశారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గ్రామంలోని అన్ని కులాల వారు ఆషాడం బోనాలు తీయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఆదివారం ఇంటింటికి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పుసప్పులు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా ఆలయం వరకు కొనసాగింది. ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదర్శన నిర్వహించి ఆలయ ముందు బోనాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

ఆషాడం బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే..

కామారెడ్డి : ఆషాడం బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాల కమిటీల ఆహ్వానం మేరకు పట్టణ పరిధిలో ఉన్న రాజానగర్‌లోని పోచమ్మ దేవాలయం, స్నేహపురి కాలనీలోని మైసమ్మ దేవాలయం, రుక్మిణి కుంటలోని కట్ట మైసమ్మ దేవాలయాలను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి సందర్శించి ఉత్సవాల్లో ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఆషాఢమాసం బోనాల శుభాకాంక్షలు తెలిపారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ..

కామారెడ్డి యాదవ సంఘం ఆధ్వర్యంలో పట్టణ యాదవ సంఘం సభ్యులు పెద్దఎత్తున శ్రీ భురుగు మైసమ్మ బోనాల పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు అర్కల ప్రభాకర్ యాదవ్, అటికల క్రిష్ణ యాదవ్, కన్నెబోయిన అశోక్ యాదవ్, కుంభాల లక్ష్మణ్ యాదవ్, అరికల గంగారం యాదవ్, ఉడుతల ఆంజనేయులు యాదవ్, కన్నెబోయినా మురళీ యాదవ్, డి. చంద్రము యాదవ్, లింగం యాదవ్, ఎల్లేష్ యాదవ్, ఆర్యాల రాజేష్ యాదవ్, రాజు యాదవ్, ప్రకాష్ యాదవ్, వెంకట్ యాదవ్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహాంకాళి అమ్మవారి పండుగ..

బీబీపేట్ మండల కేంద్రంలోని శ్రీ మహాంకాళి అమ్మవారి పండుగను వర్షంలోనూ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు ఊరేగించి ఓడి బియ్యం పోసి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా అకాడి పున్నమి పండుగ..

మద్నూర్ : మండల కేంద్రంలో అషాడమాసం అకాడి పున్నమి పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించారు. పోచమ్మ పాపమ్మ, ఉరడమ్మ, లక్ష్మమ్మ, ఎర్ర పోచమ్మ, నల్ల పోచమ్మ బారడి పోచమ్మ, దూర్పతిమాయి తదితర గ్రామ దేవతలకు పప్పు పోలేలతో ప్రత్యేకంగా నైవేద్యం సమర్పించారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.



లింగంపేట్‌లో..

చాముండేశ్వరి ఆలయం అభివృద్ధి కోసం కృషి చేస్తా



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దోమకొండ

ఆలయాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో మహంకాళి బోనాల పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు ఆదివారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆలయం అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని రైతుల పడి పంటలు పండి అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయం ఉత్సవ కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి సిద్దరెడ్డి, శేఖర్, రమేష్, నాయకులు అనంతరెడ్డి, తీర్మాల్‌గౌడ్, నర్సారెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ అమలవుతున్నందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు నాయకుల ఇల్లెందుల రంజిత్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బుడ్డ పోశెట్టి, మాజీ ఉప సర్పంచ్ కుంట శ్రీనివాస్, చేపూరి శ్రీనివాస్ గౌడ్, జయరాం, విష్ణు వర్ధన్‌గౌడ్, సాయి చరణ్‌గౌడ్, దేవుగొండ సంతోష్, పెంట సాయికుమార్, పొన్నాలరాజు, మన్నే శోభ తదితరులు పాల్గొన్నారు.

మానవసేవయే మాధవసేవ

- జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతరావు



నవతెలంగాణ-బిచ్కుంద

సమాజ శ్రేయస్సును కోరి సాటివారికి ఆదుకోవాలనే సంకల్పంతో మానవసేవయే మాధవసేవగా భావించి ప్రజలకు ఉపయోగకరమైన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు అన్నారు. ఆదివారం బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హ్యుమానిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ బిచ్కుంద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీక్లీ ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ ఫర్ నీడీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన భోజనాన్ని రోగులకు పంచిపెట్టారు. హ్యుమానిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ ద్వారా మున్ముందు సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లికార్జునప్పా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్ గంగాధర్, పిసిసి డెలిగెట్ విట్టల్ రెడ్డి, నాయకులు గౌస్, సోపాన్ సార్, బాల్ కిషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఉన్నారు.

ఉత్తమ రక్తదాత అవార్డును అందుకున్న సామల సంతోష్‌రెడ్డి



అవార్డును అందుకుంటున్న సంతోష్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ముషీరాబాద్ వైశ్య బాలుర హాస్టల్లో ఏర్పాటు చేసిన ఉత్తమ రక్తదాతల అవార్డ్ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ ఐవీఎఫ్ (ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్) సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ టూరిజం చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, ఐవీఎఫ్ సేవదళ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ నీల బాలు 42 సార్లు రక్తదానం చేసినందుకు గానూ కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ గ్రామానికి చెందిన సామల సంతోష్‌రెడ్డిని మెడల్, శాలువాతో సత్కరించి మెమోంటోను, ఉత్తమ రక్తదాత అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సామల సంతోష్‌రెడ్డిని గ్రామపెద్దలు, యువకులు పలువురు అభినందించారు.

రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-సదాశివనగర్

కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు తేదీ 28 జూన్ 2024 వరకు ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని పట్టాలు పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికిగానూ రైతు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్, రైతుబీమా, దరఖాస్తు ఫారం నింపిన ఫామ్ రైతు స్వయంగా వచ్చి తమ సంబంధిత మండల వ్యవసాయ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఆగస్ట్ 5వ తేదీలోపు ఈ దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

విహారయాత్రలో సహకార సంఘం సభ్యులు



విహారయాత్రలో సంఘం సభ్యులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార సంఘం పాలకవర్గంతో పాటు సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డితో కలిసి విహారయాత్రకు ఆదివారం తరలివెళ్లారు. అయోధ్యలోని రామ మందిరం చేరుకొని అక్కడ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాశీకి వెళ్లారు. కార్యక్రమంలో సంగం ఉపాధ్యక్షులు గాంధారి అనిల్ రెడ్డి, సంఘం సభ్యులు చేపూర్ నగేష్‌గౌడ్, పరశురామ్‌గౌడ్, బర్దిపూర్ ప్రవీణ్, కమలాకర్‌రెడ్డి, మొద్దోల్ల సురేష్, పరశురాంగౌడ్, సభ్యులు, కార్యదర్శి రాజారాం, ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాస్, జగన్, సాయిలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

- పెద్ద ఎత్తున అన్నదానం

నవతెలంగాణ-విలేకరుల బృందం



బోధన్: ఉపాధ్యాయుడికి సన్మానం



మద్నూర్‌లో.. అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పలు గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మద్నూర్ : కేంద్రంలోని గంగ్ శెట్టి హనుమాన్ మందిరం వద్ద సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం కాకడ హరతీ అనంతరం పంచామృత మంగళస్నానం చేపట్టారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

బోధన్ : మండలంలోని బండారుపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. బండారుపల్లి పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న నారాయణ, రాజు ఉపాధ్యాయులను, అలాగే బదిలీపై బండరుపల్లి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు ధనరాజ్, సరితలను గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. గురు పౌర్ణమి సందర్భంగా తమను సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు సాయిలు, వెంకటేష్, గంగాధర్, నీలకంట పటేల్, తదితరులు, పాల్గొన్నారు.

కందకుర్తి గోదావరి తీరాన గురుపూజోత్సవం..

రెంజల్ : మండలంలోని కందకుర్తి గోదావరి తీరానున్న సీతారాం త్యాగి మహారాజ్ ఆశ్రమంలో ఘనంగా గురు పౌర్ణమి పురస్కరించుకొని గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నీలా మాజీ సర్పంచ్ గౌరాజి లలిత రాఘవేందర్, కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గోదావరి తీరానికి వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు బి.రమేష్, డి.యోగేష్, రమేష్, సురేష్, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, సింహరాయులు, మోహన్, తదితరులు, పాల్గొన్నారు.

దత్తాశ్రమంలో గురుపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే..

కామారెడ్డి : గురు పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని బైపాస్ వద్దగల దత్తాశ్రమంలో జరిగిన హెూమపూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి పాల్గొని తీర్థ ప్రసాదములను స్వీకరించారు.

విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం

- గౌతమ్ మోడల్ స్కూల్



విద్యార్థి నాయకులతో ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-కామారెడ్డి

గౌతమ్ మోడల్ స్కూల్ కామారెడ్డి పాఠశాలలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలను నేర్పించవలసిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం జనరల్ ఎన్నికలు తలపించే విధంగా విద్యార్థులకు ఓటింగ్ విధానాన్ని నేర్పించడం మంచి పరిణామమని తెలిపారు. విద్యార్థి నాయకులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. 'జీవితంలో క్రమశిక్షణ ముఖ్యమని, దీనిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మిదేవి, హైస్కూల్ ఇన్చార్జ్ సంతోష్, ప్రైమరీ ఇన్చార్జ్ రేష్మ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, పిర్కట్టి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లెట్స్ దానం చేసిన శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి


కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డెంగ్యూ చికిత్స పొందుతున్న సౌమ్య అనే పేషంట్‌కు అతి తక్కువ మందిలో ఉండే ఓ నెగెటివ్ ప్లేట్లెట్స్ అవసరం కావడంతో పేషంట్ కుటుంబసభ్యులు కామారెడ్డి జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులను సంప్రదించడంతో ఒక్క ఫోన్‌కాల్‌తో వెంటనే స్పందించిన మాచారెడ్డి మండలం ఎంఈఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహించే ఫరీద్‌పేట్ గ్రామానికి చెందిన చిన్నపాపయ్యగారి శ్రీకాంత్ రెడ్డి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హుటాహుటినా వచ్చి ప్లేట్లెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా రక్తదాతను జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్‌ను అభినందించారు. కార్యక్రమంలో సంతోష్, పేషేంట్ కుటుంబ సభ్యులు కేబీఎస్ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్లేట్లెట్స్‌ని దానం చేస్తున్న శ్రీకాంత్

విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ గణేష్



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) గణేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గత 3 రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, ప్రజలు ఎవరూ తడిసిన విద్యుత్ స్తంభాలను పట్టుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలన్నారు. పిల్లలను కరెంటు వస్తువుల దగ్గరికి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. రైతులెవరు పొలాలకు వెళ్ళినప్పుడు బోరు బావుల దగ్గర అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు నిలిచే వరకు మరమ్మతు పనులు చేయకూడదని, స్టార్టర్ డబ్బాలను తాకవద్దని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి మరమ్మతు పనులైన సొంతంగా చేసుకోకూడదని విద్యుత్ శాఖ వారికి సమాచారం ఇవ్వాలని, శివారు ప్రాంతాలలో పశువుల కాపర్లు ఎక్కడైనా వదులైనా, తెగిపడిన విద్యుత్ తీగలను గమనిస్తే వాటికి దూరంగా ఉండాలని విద్యుత్ శాఖ వారికి తెలపాలన్నారు. విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

లయన్స్ క్లబ్ గ్రీన్ అధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

బీజేపి పట్టణ ప్రధాన కార్యదర్శి పోల్కం వేణును లైన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ పట్టణ అధ్యక్షునిగా నియామకం చేసినందుకు పట్టణంలోని ఆయన స్వగృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానం చేసినట్టు జిల్లా అధికార ప్రతినిధి జస్సు అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా లైన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేసి ఇలాంటి మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని కోరారు. పట్టణ ప్రధాన కార్యదర్శి పులి యుగంధర్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్‌కుమార్, కార్యదర్శి రెడ్డబోయిన మూర్తి, పట్టణ గిరిజన మోర్చా అధ్యక్షులు కేలోత్ పీర్‌సింగ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సన్మానించిన పలువురు

బోనం ఎత్తిన అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వినాయక్ నగర్ లక్ష్మి సిల్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండుగ ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆదివారం హాజరైనారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ పండుగల్లో ఒకటి బోనాల పండుగని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశాడమాసంలో బోనం సమర్పించి అమ్మవారిని కొలవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ పంచరెడ్డి లావణ్య, లింగం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, ప్రభాకర్, ఆనంద్, పవన్, కార్తీక్, ముందడ పవన్, సతీష్, హరీష్, కృష్ణ, బాబీ సింగ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

జీవితంపై విరక్తి చెంది యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మానిక్ బండారు తండాకు చెందిన బానావత్ దివ్య (20) జీవితంపై విరక్తి చెంది ఇంట్లో కిటికీకి చున్నీతో ఉరి వేసుకొని ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బానావత్ దివ్యకు మానసిక స్థితి సరిగా లేదు, కండ్లు సరిగా కనపడనందున జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో కిటికీకి చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. తండ్రి బానవత్ అమర్ సింగ్ ఫిర్యాదు మెరకు కోసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని 5వ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడని నిజామాబాద్ ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ అశోక్ ఆదివారం తెలిపారు. ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం దొడ్డి కొమరయ్య కాలనీకి చెందిన షేక్ అక్బర్ (26) తన బామ్మర్దితో కలిసి చేపలు పట్టేందుకు నగర శివారులో నాగారం ప్రాంతానికి వెళ్లారు. ఇద్దరు కలిసి చాపలు పడుతున్న సమయంలో చేపలు పట్టేందుకు వేసిన గాలం వేరే దానికి చెరువులో చిక్కుకోగా దానిని తీసేందుకు షేక్ అక్బర్ వెళ్ళాడు. ఆ చెరువులో ఒకేసారి స్పీడ్ గా నీరు రావడంతో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. అయితే ఈత రాకపోగా నీట మునిగి గల్లంతయ్యాడు. అనంతరం ఐదో టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సాయంతో మృతదేహాన్ని బయటకు వెలికితీశారు. మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య తస్లిమిన్ ఫిర్యాదు మేరకు ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అశోక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వరాజ్య పాదయాత్ర 2వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో డిఎస్‌పి మండల కమిటీ ఆధ్వర్యంలో స్వరాజ్య పాదయాత్ర 2వ వార్షికోత్సవం ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 3కోట్ల మంది బిసి, ఎస్సి, ఎస్టి ప్రజల రాజ్య స్థాపనకై డా.విశారదన్ మహారాజ్ 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర బాల్కొండ మండల కేంద్రానికి చేరుకొని ఈనెల 21 నాటికి 2వ వార్షికోత్సవం సందర్భంగా శిలాఫలకానికి పూలమాల వేసి స్వరాజ్య పాద యాత్రను స్మరించుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బాల్కొండ మండల డిఎస్పీ కన్వీనర్ నిశాంత్ మహారాజ్, మండల నాయకులు హారప్ప, మురళి, ఆత్మ గౌరవ్, శేఖర్, నితీష్, రాజశేఖర్, రంజీత్, పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ తిరుపతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాబోయే 48 గంటల లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి అని వాతావరణ శాఖ వారు హెచ్చరించారని జక్రాన్‌పల్లి ఎస్ఐ తిరుపతి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాగులు, చెరువులు, కుంటలు పొంగి పొర్లే ప్రమాదం ఉంది కావున ప్రజలు ఏమైనా ప్రయాణాలు ముందే అనుకొని ఉంటే 48 గంటలు వాయిదా వేసుకోవాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప ఇంట్లో నుండి బయటకు రావొద్దని అన్నారు. రోడ్లపై నుండి వరద నీరు వెళ్లే ప్రమాదం ఉందని, అలా వరద నీరు ప్రవహిస్తున్నపుడు ఏమవుతుంది లే అని అట్టి రోడ్లు దాటితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. కావున ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి రోడ్లు దాట రాదని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షం వల్ల ఏదయినా సమస్య వస్తే వెంటనే 100, 8712659853, 8712659742 నెంబర్లకు కాల్ చేయాలని తెలిపారు. చెట్ల కింద, పాడైన భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదని అన్నారు. కరెంటు స్తంభాలు ముట్టుకోరాదని తెలిపారు.


అవసరం మేరకే బయటకు వెళ్లాలి

- ఎస్‌హెచ్ఓ అశోక్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర ప్రజలందరికీ పోలీసు వారి హెచ్చరిక రాబోయే 48 గంటలలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ వారు హెచ్చరించారు. కావున కాలువలు, చెరువులు, కుంటలు పొంగి పొర్లే ప్రమాదం ఉందని, అత్యంత అవసరాల మీరకే బయటకు వెళ్లాలని ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ అశోక్ ఆదివారం సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు వర్షం వల్ల ఏదయినా సమస్య వస్తే వెంటనే 100 నంబర్‌కి కాని, 8712659844 (ఎస్‌హెచ్ఓ టౌన్-5) నెంబర్‌కి ఫోన్ చేయగలరని తెలిపారు.

యోగా గురువులకు సన్మానం



యోగా గురువులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

వినాయక్‌నగర్‌లోని పతంజలి యోగా సెంటర్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా నిజామాబాద్‌లో గల యోగా గురువులందరికి సన్మానించారు. కార్యక్రమంలో యోగ రత్న ఎక్కొండ ప్రభాకర్, కిషన్, అంజనేయులు, జలంధర్ గౌడ్, వివిధ యోగా సెంటర్ల గురువులు పాల్గొన్నారు.

అక్షర సేనాని దాశరథి

- అక్షర ఆగ్రహానికి వేదికైన ఇందూరు ఖిల్లా
- నేడు దాశరథి కృష్ణమాచార్య జయంతి
- ఆయన సాహిత్యం తొలి, మలి దశ ఉద్యమాలకు స్ఫూర్తి

నవతెలంగాణ-ఆర్మూర్

నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ గర్జించిన దాశరథి కృష్ణమాచార్యుల అక్షర ఆగ్రహానికి ఇందూరు ఖిల్లా వేదిక అయింది. ఆ అక్షర సేనాని దాశరథి జయంతి నేడు. ఈ సందర్భంగా నవ తెలంగాణ కథనం..

ప్రధాన పాత్ర పోషించిన సాహిత్యం...

19 25 జులై 22న మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు గ్రామంలో దాశరథి జన్మించారు. నిజాం నవాబుల నుంచి తెలంగాణ విముక్తి పోరాటం విరోచితమైనది .అనేకమంది త్యాగాల ఫలితంగా సెప్టెంబర్ 17, 1948 లో తెలంగాణ గడ్డపై త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ఆగస్టు 15, 1947 లో స్వతంత్రం వచ్చినప్పటికీ తెలంగాణ మాత్రం అదనంగా మరో 13 నెలలపాటు పోరాటం చేయాల్సి వచ్చింది. ఈ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారెందరో. విముక్తి పోరాటంలో నిజాం కు వ్యతిరేకంగా రాసిన సాహిత్యం ప్రధాన పాత్ర పోషించింది. 1977 ఆగస్టు 19న రాష్ట్ర ఆస్థాన కవిగా దాశరథి నియమితులయ్యారు. 1978లో గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సొసైటీ నుంచి ఆంధ్ర కవిత సారధ బిరుదు పొందారు. 1981లో కళా సరస్వతి ఆంధ్ర రత్న పురస్కారం పొందారు. 1987 నవంబర్ 5 మరణించారు .



ఖిల్లా జైలులోని దాశరథిని ఉంచిన గది

నేటికి దాశరథి సాహిత్యం తెలంగాణ సమాజాన్ని మేలుకొలుపుతూనే ఉంది..

పేదల గూర్చి నేను మ్రోగింతును రుద్రవీణ... పలికింతును విప్లవ గీతకాన్ని.... ఓ నిజమా.. పిశాచమా ...కాన రాడు..... నిన్ను బోలిన రాజు మాకెన్న డేని... తీగలను తెంపి అగ్నిలో దింపినావు... నా తెలంగాణ కోటి రతనాల వీణ... తదితర ఎంతో ప్రావీణ్యతను సంతరించుకున్నవి.

ఘనమైన గతం ఉన్న..

జిల్లాలోని 53 ఎకరాల సువిశాల ఎత్తైన కొండపై ఖిల్లా జైలు రఘునాథ ఆలయం ఉన్నాయి. 9వ శతాబ్దంలో మూడో రాష్ట్ర కూట చక్రవర్తి ఇంద్ర నారాయణుడు ఈ కోటను నిర్మించాడు. చాలా ఏళ్లు సైనిక స్థావరంగా కొనసాగింది .సైనికులకు ఇక్కడే ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారని అంటారు. 4 వందల ఏళ్ల క్రితం నిజాం కాలంలో జైలుగా మార్చారు. 8 బారెక్‌లు ఉన్న జైలులో తెలంగాణ విమోచన కోసం వందల మంది ఉద్యమకారులు ఇక్కడే కఠిన శిక్షలు అనుభవించారు. దాశరథి, ప్రముఖ నవల రచయిత అల్వార్ స్వామి జైలు జీవితం గడిపారు. తర్వాతి కాలంలో ఈ జైలును సారంగాపూర్ కు తరలించారు. దాశరథి శిక్ష అనుభవించిన జైలు గది శిథిలంగా మారింది .ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర పర్యటక శాఖ ,పురవస్తు శాఖ, దేవాదాయ శాఖ అధికారులు గతంలో ప్రాంగణాన్ని సందర్శించారు. 5 లక్షలతో దాశరథి కల్చరల్ హాల్, అదనపు పనుల కోసం ఐదు లక్షల నిధులు కేటాయించినారు.

జిల్లా జైలులో దాశరథి...

దాశరథి మూడు నెలలు జిల్లా జైలులో ఉన్నట్లు సమాచారం.. ఈ సమయంలో ఆయన జైలు గోడలపై పళ్ళు తోముకునే బొగ్గుతో నిజాం పాలనకు వ్యతిరేకంగా సాహిత్యాన్ని రాశారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గోడలపై రాసిన ఈ కవితాంశం అప్పటి నిజాం విముక్తి పోరాటంతో పాటు ఉమ్మడి రాష్ట్రంలోని తొలి, మలి విడత ఉద్యమాల్లో తిరుగులేని ప్రభావాన్ని చూపించి, ఉద్యమాలను ముందుకు నడిపించింది. ఎందరో ఉద్యమకారులకు ఖిల్లా జైలు స్ఫూర్తినిచ్చింది.

ఎన్ని చోట్ల భూమి ఉన్న ఒకే బీమా

- మండల వ్యవసాయ అధికారి దేవిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఎన్నిచోట్ల భూమి ఉన్న ఒక ఊరిలో మాత్రమే రైతు బీమాకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి దేవిక ఆదివారం తెలిపారు. రైతు బీమా 2024-25 పాలసీ సంవత్సరం గురించి మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. ఇంతకుముందు రైతు భీమా చేసుకోని రైతులు ఈ సంవత్సరం రైతు బీమా (రైతు మరణిస్తే వచ్చే 5 లక్షల భీమా) చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. కావున రైతులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నియమ నిబంధనలు..

రైతులు 18 నుండి 59 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. వయస్సు పక్కాగా ఆధార్ కార్డ్ ప్రకారమే తీసుకుంటారు. అందులో ఎలా ఉంటే అదే ప్రామాణికం. ఎన్ని చోట్ల భూమి ఉన్నా ఒక ఊరిలో మాత్రమే బీమాకు అవకాశం ఉంటుంది. రైతే స్వయంగా వచ్చి నామినేషన్ ఫారం మీద సంతకం చేసి భూమి పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్ మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారికి అందజేయాలని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం. నామినేషన్ ఫామ్ లేదా దరఖాస్తు ఫారం. పట్టాదారు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కారు అందించాలన్నారు. ఇప్పుడు మీరు బీమా చేసుకోకపోతే ఇంకో సంవత్సరం వరకు భీమా చేసుకోవడానికి అవకాశం ఉండదని తెలిపారు.

బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి

- తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం(బిఎల్‌టీయూ)

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2014 ఫిబ్రవరి 28, బీడీ కార్మికుల పెన్షన్ కటాఫ్ డేట్ ఎత్తివేసి, బీడీ పరిశ్రమలో పనిచేసే అందరికీ రూ.4016 జీవన భృతి ఇవ్వాలని తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం (బిఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్.సిద్దిరాములు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని బీడీ పరిశ్రమలో పనిచేయు బీడీ కార్మికులకు, ప్యాకర్లకు, బట్టి, చాటన్, టేకేదార్ తదితర అన్ని తరగతుల కార్మికులకు 2014 ఫిబ్రవరి 28 కటాఫ్ డేట్ పెట్టడం మూలంగా 2015 మార్చి నుంచి పిఎఫ్ నెంబర్లు ఉన్న వారికి జీవన భృతి రావడంలేదన్నారు. కటాఫ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఎత్తి వేసి బీడీ పరిశ్రమలో పనిచేయు అందరికీ రూ.4016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, బి.జగదీష్, రాష్ట్ర కోషధికారి, సైదయ్య ద్, జిల్లా కార్యదర్శి, వేణు, సుజాత, కల్పనా, లక్ష్మి, రేణుకా, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

గురు పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/కంఠేశ్వర్

మండలంలోని ఉప్లూర్‌లో శ్రీ షిరిడి సాయి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని బాబా విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూర్ణభిషేకం, విశేషపంచామృత అభిషేకం, కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ బాబా ఉత్సవ విగ్రహంతో పల్లకి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నందగిరి దయానంద్, పోలేపల్లి లచ్చయ్య, బద్దం గంగారెడ్డి, యెనుగందుల శశిధర్, సాయి భక్తులు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : జిల్లా కేంద్రంలోని శ్రీ శివ సాయి బాబా ఆలయం వివి నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి ఉత్సవాలు ఆలయం ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అభిషేకం, హారతి మహిళ భక్తులతో కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో కమిటీ సభ్యులు సన్మానించారు. కమిటీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గురు పౌర్ణమి సందర్భంగా చదువులు చెప్పిన గురువులను సన్మానించడం, పూజించడం, తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి శ్యాంసుందర్ ఉపాధ్యక్షులు గంగారం, రఘువీర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి గంగాధర్, కోటేశ్వరరావు, సలహాదారులు ఆంజనేయులు, అమర్ జీత్‌రెడ్డి, రామచందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : పూజలు చేస్తున్న భక్తులు

ఉన్నత పాఠశాలల పని వేళల్లో మార్పులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జిల్లాలోని ఉన్నత పాఠశాలల పని వేళల్లో మార్పులు జరిగాయని మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 22 నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 నిమిషాల వరకు ఉన్నత పాఠశాలలు పనిచేస్తాయని తెలియజేశారు. గతంలో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4. 45 నిమిషాల వరకు పాఠశాలలు పని చేసేవని తెలిపారు. జిల్లా విద్యాధికారుల ఆదేశాలతో ఉన్నత పాఠశాలల్లో పని వేళల్లో మార్పులు జరిగాయని తెలిపారు.

శ్రీ భాషిత పాఠశాలలో సోపానం వేడుకలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలలో శనివారం సాయంత్రం ఫ్రెషర్స్‌డే వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలతో కొత్తగా చేరిన విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, శ్రీ పోలపల్లి సుందర్ నూతన విద్యార్థులకు స్వాగతం చెప్పారు. శ్రీ భాషిత పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి, తన 25 నుంచి 30వ ఏట వరకు ఎంత గొప్పగా ఉండాలని గమ్యం నిర్ణయించుకుంటే, శ్రీ భాషితలో ఇచ్చే చదువు, సంస్కారం, క్రమశిక్షణ తప్పకుండా విద్యార్థిని తన గమ్యానికి ఆనందంగా చేర్చుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు, లైఫ్ హాస్పిటల్ డైరెక్టర్, డాక్టర్ భాను రామగిరి, సిడిపిఓ జ్యోతి హాజరై మాట్లాడారు. 19 సంవత్సరాలు పూర్తి చేసుకుని 20లో అడుగుపెట్టినందుకు అభినందనలు తెలియజేశారు. విద్యతోపాటు ఫిజికల్ యాక్టివిటీస్ అవసరమన్నారు. డాక్టర్. భాను రామగిరి గారు మాట్లాడుతూ.. ఈ వేడుకలు చూస్తూ ఉంటే నాకు 25 సంవత్సరాల వెనక్కి వెళ్లి నా బాల్యాన్ని గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ.. ఈ 'సోపానం' కార్యక్రమం విద్యార్థులకు తన గమ్యాన్ని రోజూ గుర్తుచేయాలని, పాఠశాలకు సహకరిస్తున్న తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం 2023-24 సంవత్సరానికి సంబంధించిన అకాడమిక్ పెర్ఫామెన్స్‌కి విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అథితుల చేతుల మీదిగా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ప్రియాంక, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పకడ్బందీ తనిఖీలేవి?

- కంటి తుడుపుగా దాడులేనా
- వంటల్లో నాసిరకం నూనె వాడకం

నవతెలంగాణ-ఆర్మూర్

వెలుగుల జిగేలుతో ఆకర్షించే రెస్టారెంట్లు, హెూటళ్లలో అపరిశుభ్రత వాతావరణం. పరిశుభ్రత కరువై పర్యవేక్షించే నాథుడే లేకుండా పోయాడు. ప్రధానంగా వంట చేసే గదులు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. అక్కడే పాత్రలు కడగడం పరిశుభ్రత లేని వాతావరణంలో వంటలు చేస్తుండడం.. మంచి నూనెలు కాకుండా నాసిరకం నూనెలు వాడుతున్నారని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.

ధరలు ఆకాశంలో.. నాణ్యత పాతాళంలో..

రెస్టారెంట్లు హెూటళ్ల పైకి చూడడానికి ఆకర్షణీయంగా ఉంటాయి. వెలుగు జిలుగులతో నేమ్ బోర్డులు ఏర్పాటు చేస్తారు. ఎంట్రెన్స్ మొదలు లోపలికి వెళ్లిన తర్వాత కూర్చునే సోఫాలు, కుర్చీలు, టేబుళ్లు అద్దంలా మెరిసిపోతుంటాయి. పుస్తకం సైతం రాయల్‌గా ఉంటుంది. ధరలు చూస్తే మాత్రం కళ్లుబైర్లు కమ్మాల్సిందే. పేదలు వారం రోజులపాటు ఇంటిల్లిపాది తినే ఖర్చు ఒక యూనిట్ ఆహారానికి ధరలు చెల్లించాల్సిన పరిస్థితి. మంచినీళ్లు అందుబాటులో ఉంచరు. వాటర్ బాటిల్ కచ్చితంగా అంటగడతారు. ఈ నీళ్ల బాటిల్స్ ధర లీటర్‌కు రూ. 30 నుంచి 60 వరకు వసూలు చేస్తుంటారు.

తినాలంటే ఆలోచించాల్సిందే..

మీరు బేకరీ కి వెళ్తున్నారా.. జర జాగ్రత్తగా ఉండాలి.. చాయ్, సమోసా, బేకరీ, ఫుడ్స్ నూడుల్స్, ఫ్రైడ్‌రైస్ ఇలా ఏదైనా సరే తినేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. ఆహారంలో ఏదైనా రావచ్చు, ఉండొచ్చు. కొన్ని గల్లీ హెూటల్లో నుంచి పెద్ద హెూటల్లో వరకు రుచి మాట దేవుడెరుగు, శుభ్రత లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తమ ఇష్టారాజ్యంగా వెలుస్తున్న హెూటల్లు, టిఫిన్ సెంటర్లలో ఫుడ్ బిజినెస్ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. వినియోగదారులను ఆకర్షించడానికి వీటిలో రుచి కోసం రకరకాల ఆహర పదార్థాలను వాడుతున్నారు. రుచి కోసం ఇలా మనుషుల ఆరోగ్యం పాడు చేసే పదార్థాలు వాడకం ఒక కారణమైతే పూర్తిగా నాణ్యత లేకపోవడం మరో కారణం.. ఏది ఏమైనా హెూటల్లో కనీసం నిబంధనలు పాటించకపోగా నాణ్యత అసలు పాటించిన దాఖలాలు ఉన్నట్లు కనబడడం లేదు.

స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాల ఆధ్వర్యంలో..

రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు గత నెలలో జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు రెస్టారెంట్లపై దాడులు చేసి ఆహర నాణ్యత పాటిస్తున్న శుభ్రత గురించి అనేక నివ్వెరపోయే విషయాలను కనుగొన్నారు.

సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి..

నాణ్యత ప్రమాణాలు పాటించని హెూటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలి.

వెంకటేష్ నాయక్, టిఎస్‌విఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి,



కఠిన చర్యలు తప్పవు..

నాణ్యతతో కూడిన వస్తువులతోనే ఆహార పదార్థాలు తయారు చేసి వినియోగదారులకు అందజేయాలి. ధర తక్కువ అని ఇష్టం వచ్చిన వస్తువులు వాడి వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడితే సంబంధిత ఓటర్లను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటాం.

తారా సింగ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, నిజామాబాద్.

మున్సిపల్ పరిధిలోని..

నాణ్యత ప్రమాణాలు పాటించని పలు హెూటల్లో బార్‌పై మున్సిపల్ అధికారులు ఇటీవల దాడులు నిర్వహించినారు. పట్టణంలో గత ఫిబ్రవరి, మే నెలలోనూ పలు బేకరీలలో కుళ్లిపోయిన కేకులు, కాలం చెల్లిన చాక్లెట్లు తిని చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు.

మున్సిపల్ పరిధిలోని పెర్మిట్..

మామిడిపల్లి పట్టణంలో టిఫిన్ సెంటర్లు, హెూటల్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దాబా స్వీట్ హెూమ్స్ 500పైన ఉంటాయి. తనిఖీలు చేయాల్సిన అధికారులు కంటి తుడుపు దాడులు చేయడం సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాకాలం కావడం వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రామారావు మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-భీమ్‌గల్ రూరల్

గురు పూర్ణిమ సందర్భంగా మండలంలోని గోనుగొప్పుల తండాలో బంజారాల ఆరాధ్య గురువు శ్రీ రామారావు మహారాజ్ విగ్రహం ప్రతిష్టించారు. కార్యక్రమంలో తండా పెద్దలు మత్రు నాయక్, దుప్య నాయక్, రాజేందర్, రాములు కాంగ్రెస్ నాయకులు నేనావత్ నరేందర్, స్వామి నాయక్, మన్సింగ్ తదితరులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న తండావాసులు

అపూర్వ నృత్యానికేతన్ చిన్నారుల ప్రదర్శన

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి యోగేశ్వర ఆశ్రమంలో అపూర్వ జోషీ అధ్వర్యంలో ఆదివారం చిన్నారుల నృత్య ప్రదర్శన సంబురంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగేశ్వర నంద స్వామిని సన్మానించినారు. కార్యక్రమంలో చిన్నారులు నిత్యశ్రీ, రాస హరిప్రియ, అమృత, దీక్షిత, ఆద్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

కౌలాస్ నాలా ప్రాజెక్ట్ నిండేనా?

- డెడ్ స్టోరేజికి చేరువలో నీరు
- ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో నిల్
- పంటలు కష్టమే అంటున్న రైతన్నలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మధ్యతరహ ప్రాజెక్ట్ అయిన కౌలాస్ నాళా ప్రాజెక్ట్ ప్రస్తుతం చుక్క నీరు ఎగువ నుంచి నీరురాక పోవడంతో మృగశిర కార్తె నుంచి సాధారణ వర్ష పాతం నమోదు కావడంతో కళావిహీనంగా కనిపిస్తోంది. అదేవిధంగా మండలంలో 32 చెరువులు, 28 కుంటలు, 6 చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి. వాటి పరిస్థితి కూడా ఇదే దుస్థితి ఉండటంతో పశువులకు తాగడానికి నీరు లేక రైతుల ఇంటివద్దకు తీసుకువచ్చి తాగిస్తున్నారు. తొమ్మిదేండ్లుగా మృగశిర కార్తె జూన్ మొదటి లేదా రెండు, మూడో వారంలో పూర్తిస్థాయిలో నిండు కుండలా నీటితో నిండి జలకళతో ప్రాజెక్ట్ ఉండేది. నేడు ఈ ప్రాజెక్ట్ కళావిహీనంగా సందర్శకులు లేక అధ్వానంగా కనిపిస్తుంది. ప్రాజెక్ట్ పూర్తీ స్థాయి నీటి సామర్థ్యం 458 మీటర్లు కాగా, సామర్థ్యం 1.237 టీఎంసీ జూలై 15న ఉదయం వరకు 454.40 మీటర్లు అంటే డెడ్ స్టోరేజికి చేరింది. ప్రతి ఏటా జూలై 20, 24వ తేది వరకు పంటలకు కుడి, ఎడమ కాలువలు, ఆరు డిస్ట్రిబ్యూటరి డీ1 నుంచి డీ6 కాలువల ద్వారా అధికారులు పంటలకు నీరు విడుదల చేసేవారు.

నాటి పరిస్థితి నేడు లేదు..

కుడి కాలువ ద్వారా 3 వేల ఎకరాల సాగు చేస్తే, ఎడమ కాలువ ద్వారా ఎనమిది 8700 ఎకరాలు సాగులో ఉంది. జుక్కల్ మండలంలో 5200 ఎకరాలు సాగు కాగ, బిచ్కుంద మండలంలో 3400 ఎకరాలు సాగు అవుతున్నదని ప్రాజెక్ట్ ఏఈ రవిశంకర్ నవతెలంగాణతో తెలిపారు.

2024-25 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వంకు ప్రాజెక్ట్ నిర్వహణ ఖర్చులకు మూడులక్షల పది వేల రూపాయల అంచనాలు నీటి పారుదల శాఖ పంపింది. ప్రస్తుతం టెండర్ దశలో ఉందని, కాలువల మరమత్తులు, ప్రాజెక్ట్ రోడ్డుకు కలిపి 10కోట్ల 90 లక్షల అంచనా వ్యయంతో కేంద్ర అధికారుల గైడ్‌లైన్స్ ప్రకారం కేంద్ర, రాష్ట్రం వాటాల ప్రకారం అంచనాలు పంపడం జరిగిందని మంజూరు దశలో ఉందని ఏఈ రవి శంకర్ పేర్కొన్నారు.

ఈ ఖరీఫ్ సీజన్ మొదటి విడతలో వరి నాట్లు వేసేందుకు 0.1 టీఎంసీ నీరు ఉందని, అత్యవసర సమయంలో మాత్రమే ప్రత్యేక పరిస్థితుల్లో పంటలకు నీటి విడుదల చేయడం జరుగుతుందని ప్రాజెక్ట్ అధికారులు తెలియచేశారు.

ఈ ఏడాది ఇలాగే కొనసాగితే రబీ పంట యాసంగిపైన ప్రభావం భారీగా ఉంటుందని, తీరని నష్టం తప్పదని ఆయకట్టు రైతులు అంటున్నారు.


కౌలాస్‌నాల ప్రాజెక్టు


ప్రాజెక్టు గేట్లు

సాగునీరు అందేదెలా?

- సాగునీటి కాలువకు అడ్డంగా కల్వర్టు మట్టి
- పట్టించుకోని కాంట్రాక్టర్

నవతెలంగాణ-బోధన్

సాలుర మండలంలోని తగ్గెల్లి రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన కల్వర్టు వద్ద సంబంధిత కాంట్రాక్టర్ వ్యవసాయ పొలాలకు సాగునీరు వీళ్లే పంట కాలువకు అడ్డంగా మట్టి వేయడంతో ప్రస్తుతం పంట పొలాలకు సాగునీరు వెళ్లడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు నిర్మించిన కాంట్రాక్టర్ తీసిన మట్టిని సాగునీటి కాలువకు అడ్డంగా వేశారని, దాంతో సంబంధిత కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆరుతడి పంటలు వేసిన సందర్భంగా పంటలకు సాగునీరు చేరలేక ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో పంట కాలువను పూడిక తీయాలని ఉన్న ఉపాధి హామీ సిబ్బంది సైతం పంట కాలువ పూడిక తీయడం లేదని రైతుల పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఉపాధి హామీ పథకంలో పంట కాలువ పూడిక తీయాలని రైతుల కోరుతున్నారు. ఈ విషయమై ఉపాధి హామీ సిబ్బందిని వివరణ కోరగా పంట కాలువ పూడికతీత పనులు తీసేలా అధికారుల నుంచి ఆదేశాలు రాగానే ఆ పనులు చేపడతామని తెలిపారు.


కాలువకు అడ్డంగా వేసిన మట్టి

ప్రమాదవశాత్తు లిఫ్టు గుంతలో పడి మహిళ మృతి

నవతెలంగాణ- కామారెడ్డి

మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన కామటి భూమయ్య, ఆయన భార్య కామాటి రాజేశ్వరితో కలిసి కామారెడ్డి పట్టణంలో ఉన్న తాహెర్ ఫంక్షన్ హాల్ వెనకాల కొత్తగా నిర్మిస్తున్న బిల్డింగ్‌లో వాచ్మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇరువురూ అదే బిల్డింగ్‌లో మూడో ఫ్లోర్‌లోని ఒక గదిలో ఉంటున్నారు. శనివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో రాజేశ్వరి(55) భోజనం చేసిన తర్వాత చేయి కడుక్కోవడానికి వెళ్లింది. ఈసమయంలో ప్రమాదవశాత్తు అదే బిల్డింగు నందు లిఫ్టు కోసం తీసిన గుంతలో పడిపోయింది. తీవ్ర గాయాలు కాగా భూమయ్య, ఆయన కుటుంబ సభ్యుల సహాయంతో ఆమెను గుంతలో నుండి పైకి తీశారు. అప్పటికే ఆమె చనిపోయినట్టు గుర్తించారు. మృతురాలి భర్త భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.



రాజేశ్వరి మృతదేహం

రాత్రి వేళల్లో రోడ్డుపైనే లారీలు

- ఇండికేటర్లు లేకుండా ఆపుతున్న డ్రైవర్లు
- లేబై ఉన్న లెక్కచేయని వైనం
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

44వ జాతీయ రహదారిపై వెళ్తున్న లారీలు రాత్రి సమయంలో రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగడమే కాకుండా ప్రమాదకరంగా రోడ్డుపై నిలుపుతున్నారు. బస్వాపూర్ గ్రామం నుంచి పొందుర్తి వరకు రోడ్డుకు ఇరువైపులా దాబా హొటల్లు, దుకాణాల కారణంగా ట్రక్ లేబైలో నిలపాల్సిన లారీలు రోడ్డుపై ఎలాంటి ఇండికేటర్లు లేకుండా ఆపి దాబా హొటల్లోకి, కిరాణ దుకాణంలోకి వెళ్తున్నారు. వెనకాల వస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రమాదాలు జరిగేఅవకాశం ఉంది. ఇటీవల కాలంలో నిజామాబాద్ పట్టణానికి చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. 10 నిమిషాల్లో పని ముగించు కొని వెళ్లవచ్చు అనుకొని రోడ్డుపై ఆపుతున్న లారీల కారణంగా అదే పది నిమిషాల్లో వెనకాల వస్తున్న వాహనదారుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. రాత్రి సమయాలలో ఇష్టానుసారంగా లారీలను ఆపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న లారీలపై పోలీసులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారిపై ఉన్న డాబా హొటల్లు, కిరాణా వ్యాపారస్తులకు రోడ్డుపై లారీలు ఆపకుండా ఆదేశాలు ఇవ్వాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ఉత్తమమని వాహన దారులు అంటున్నారు.


రోడ్డుపై నిలిపిన లారీ

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీలో చేరిక


పార్టీ కండువావేస్తున్న సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని కుప్కల్ గ్రామానికి చెందిన మాజీ భీంగల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ బాల్కొండ నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గుణ్ వీర్ రెడ్డి ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టి ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టిలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులై, నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వంలో ప్రజాసేవ చేయడానికి కాంగ్రెస్ పార్టిలో చేరుతున్నట్టు గున్వీర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అ'పూర్వ' సమ్మేళనం

- బాల్యస్మృతుల్ని నెమరేసుకున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బాల్యం మరువలేని జ్ఞాపకం..వృత్తి, ఉద్యోగ, వ్యాపార రిత్యా ఏ స్థాయిలో ఉన్న చిన్ననాటి మిత్రులు కనిపిస్తే తెలియకుండానే చిన్నపిల్లలం అయిపోతాం.. బడిలో చేసిన చిలిపి చేష్టలు, అల్లరి పనులు తలచుకుంటూ ఆనందంలో మునిగి తేలుతాం. నిజామాబాద్ నగరంలోని సెయింట్ మేరీ హై స్కూల్ పాఠశాల పూర్వ విద్యార్థులు అడుగడుగునా అలాంటి జ్ఞాపకాల దొంత రలే కనిపించాయి. నిజామాబాద్ నగరం లోని ఖిల్లా రోడ్డు వద్ద గల సెయింట్ మేరీ హై స్కూల్ పాఠశాలలో 1998-99 సంవత్సరం 10వతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులందరూ నిజామాబాద్ నగరంలోని వంశీ ఇంటర్నేషనల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఒక వేదికగా కలిశారు. ఇన్ని సంవత్సరాల తర్వాత విద్యార్థులు కలుసుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది. వారి సంతోషానికి అవధులు లేవు. ఆనందాల నవ్వులే వెల్లివిరిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు చిన్ననాటి స్నేహితులను కలిసి బాల్యస్మృతులు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి గురువులను సన్మానించారు. ఆత్మీయ ఆలింగనాలు.. పలకరింపులు.. ఆటపాటలతో అలరించారు. అపురూప క్షణాలను చరవాణుల్లో బంధించారు. అనంతరం ఆత్మీయ విందు ఆరగించారు. ప్రధానోపాధ్యాయులు రోజ్ మేరీ, ఉపాధ్యా యులు కిషోర్, ప్రవీణ్, మోహన్ ,లలిత, నిర్మల, విజయలక్ష్మి మహేష్ శంకర్, పూర్వ విద్యార్థులు నరేష్ భగవాన్ దాస్, కార్తీక్, సతీష్, ఖవి ఉద్దీన్, ముదాసర్, కృష్ణ పటేల్, ఆనంద్ , లావ ణ్య, రాజేశ్వరి, కపిల పాల్గొన్నారు



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

యువతి అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కలిగోట సౌజన్య శనివారం సాయంత్రం నుండి కనిపించడం లేదని ఆమె తండ్రి నర్సింలు దేవునిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. కామారెడ్డి మండలంలోని శాబ్దిపూర్ గ్రామానికి చెందిన సౌజన్య (24) విద్యార్థి ప్రస్తుతం కామారెడ్డి పట్టనంలోని కాకతీయ నగర్‌లో ఉంటున్నారు. ఆదివారం సౌజన్య తండ్రి కలిగోట నర్సింలు తన కూతురు సౌజన్య కనిపించడం లేదు అని ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే దేవునిపల్లి ఎస్సై ఫోన్ నెంబర్ 8712686 150 కామారెడ్డి రూరల్ సిఐ ఫోన్ నెంబర్ 8712686148కు తెలపాలని ఆయన కోరారు.మొబైల్ షాప్ లో చోరీకి యత్నం



నిరుపయోగంగా ఓపెన్ జిమ్‌లు



నవతెలంగాణ-ఆర్మూర్

గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రజల సౌకర్యార్థం వివిధ వార్డుల్లో 9 ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు రావడం. ప్రభుత్వం మారడం వీటి నిర్వహణ గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కాగా ఈ ఓపెన్ జిమ్‌లకు 5 లక్షల చొప్పున మూడింటికి, ఆ తర్వాత ఏర్పాటుచేసిన తొమ్మిదింటికి 10 లక్షల చొప్పున వెచ్చించారు. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో అధ్వానంగా మారాయి. కొన్నిచోట్ల పరికరాలు విరిగిపోవడంతో పాటు బేరింగ్లు చెడిపోయాయి. కొన్నిచోట్ల కింద వేసిన రబ్బర్ మ్యాట్లు సక్రమంగా వేయకపోవడంతో మాయమయ్యాయి. పట్టణంలోని స్థానిక రిజిస్టర్ ఆఫీస్ వెనకాల మరి కొన్నిచోట్ల వీటి పరిస్థితి అధ్వానంగా తయారైంది వీటి నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజును ఆదివారం వివరణ కోరగా కాంట్రాక్టర్లను పిలిపించి మరమ్మత్తులు చేయిస్తామని తెలిపారు.

తక్షణమే మరమ్మత్తు చేయించాలి...

పట్టణంలో ఓపెన్ జిమ్లకు ప్రజలు ఎక్కువగా వెళుతున్నారు. సక్రమంగా పనిచేయడం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే మరమ్మత్తు చేయించాలి. పల్లపు వెంకటేష్, సిపిఎం డివిజన్ కార్యదర్శి, ఆర్మూర్

సేవకు వయసుతో సంబంధం లేదు

- ఇంటలిజెన్స్ ఎస్పీ రంజాన్ రతన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

సేవకు వయసుతో సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర ఇంటలిజెన్స్ ఎస్పీ రంజాన్ రతన్ అన్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1982-84ఇంటర్మీడియట్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్వీకె కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇంటిలిజెన్స్ ఎస్పీ రంజన్ రతన్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ముందుగా 1984 బ్యాచ్ ఇంటర్‌లో చనిపోయిన 17మంది చిత్రపటాల ముందు దీపాలు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. మనం చదువుకున్న పాఠశాలలకు, కళాశాలల్లోని పేద విద్యార్థులకు సహాయం అందించాలన్నారు. తాను చదువుకున్న కళాశాలకు చెందిన 1984బ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న మనం యిప్పుడు మంచి ఉన్నత స్థానాల్లో న్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో నిష్ణాతులైన బోధకులు ఉండటం వల్లే ఈరోజు తాను ఎస్పీ స్థాయిలో ఉన్నానని తెలిపారు. చదువు చెప్పిన గురువును, తల్లి తండ్రులకు ఎప్పుడు గొప్ప స్థానం ఇచ్చి గౌరవించాలన్నారు. నిరుపేద విద్యార్థులకు సహాయం అందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సంజీవరెడ్డి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు ఇంటర్‌లోని అన్ని గ్రూపుల వారు ఇంత పెద్ద ఎత్తున కలవడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరు చదువుకున్న కళాశాల అభివృద్ధికి చేయూత నివ్వాలని సూచించారు. ఇదే బ్యాచ్‌కు చెందిన సంగారెడ్డి అడిషనల్ ఎస్పీ సంజీవరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎల్లారెడ్డికి ఓ ప్రత్యేకత ఉందన్నారు. 5గురు భారత ప్రధానులు ఎల్లారెడ్డిలో అడుగు పెట్టారన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. తాను కూడా ఇదే కళాశాలలో చదువుకోవడం, ఈరోజు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ బ్యాచ్‌కు ప్రోత్సాహం అందించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆంజనేయులు మాట్లాడుతూ.. 1984బ్యాచ్ పూర్వ విద్యార్థులు సేవాభావంతో ముందుకు సాగాలన్నారు. వ్యాపారి బాబు, ఇదే ఇంటర్ బ్యాచ్‌కు చెందిన మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, సబ్ రిజిస్ట్రార్ రవి, రాజ్‌కుమార్, వి.రాజేందర్ నాథ్, మర్కళ్ల వెంకటేశం, విజయ్, రమేష్, లియకుల్లాఖాన్, విష్ణు, వెంకట కృష్ణ, జైరాములు, పద్మ, మంగమ్మ, పద్మ, మాణిక్యమ్మ, హేమలత, సునందతో పాటు ఈ సమ్మేళనానికి హాజరైన 90మంది పూర్వ విద్యార్థులు తమ తమ ప్రసంగాల్లో 42ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహణకు ముందుకు వచ్చిన అదనపు ఎస్పీ సంజీవరావు, సీనియర్ జర్నలిస్ట్ రాజ్ కుమార్, మర్కళ్ల వెంకటేశం, వెంకట కృష్ణను తోటి స్నేహితులు అభినందించారు.



తల్లి కూతురు అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

తన కూతురు, మనమరాలు కనిపించడం లేదని గూడెం గ్రామానికి చెందిన నల్లకుంట సుజాత ఆదివారం దేవునిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండంలోని గూడెం గ్రామానికి చెందిన నల్లకుంట సుజాత, ఆమె కూతురు స్వరూప, ఆమె మనమరాలు తేజస్వి నాలుగు సంవత్సరాలు, మూడు నెలల క్రితం స్వరుపకు భర్త బాబుతో గొడవ జరిగింది. అప్పటి నుండి తల్లి ఊరు అయిన గూడెం గ్రామం వచ్చి ఉంటుంది. మూడు రోజుల క్రితం స్వరూప తన కూతురుతో కలిసి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయింది. ఆమె చుట్టుపక్కల బంధువుల ఇండ్లలో వెతికినా కనిపించలేదు. దీంతో ఆదివారం దేవుని పల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి సుజాత ఫిర్యాదు చేసింది. బీ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. వీరి వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే ఈ క్రింది నెంబర్లకు తెలపాలని అన్నారు. దేవనపల్లి ఎస్సై 8712686150, కామారెడ్డి రూరల్ సిఐ 871268614 నెంబర్లకు తెలపాలని పేర్కొన్నారు.



మొబైల్ షాప్‌లో చోరీకి యత్నం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సాందీపని జూనియర్ కళాశాల పక్కన గల హైమద్ మొబైల్స్ లో గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగలకొట్టి దొంగతనం చేయడానికి యత్నంచేశారు. మొబైల్ షాప్ యజమాని అయిన నజీర్ హైమద్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేయడం జరిగిందనీ పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తమ విచారణలో మొబైల్ షాప్ నుండి ఎలాంటి డబ్బు గాని, ఫోన్లు గాని, మరే ఇతర వస్తువు గాని దొంగతనం జరగలేదని అన్నారు. దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తులను పట్టుకోవడానికి పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.